క్లుప్తంగా

సైబర్ మోసం

పటాన్‌చెరు టౌన్: క్రెడిట్ కార్డ్ అప్డేట్ అంటూ సైబర్ మోసానికి గురైన బాధితుడు నగదు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్‌కు చెందని వ్యక్తికి మార్చి 28న క్రెడిట్ కార్డ్ అప్డేట్ చేయాలని బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామని చెప్పాడు. దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా చేసి తన ఫోన్‌కు వచ్చిన ఓటీపీని చెప్పాడు. వెంటనే అతని ఖాతాలో ఉన్న నగదు రూ.35 వేలు నగదు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు, అనంతరం అమీన్‌పూర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దేవాలయాల నిర్మాణాలకు శంకుస్థాపనలు



శంకుస్థాపనలో నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం పంచాయతీ పరిధిలో గల అల్లీనగర్‌లో గాలిపోచమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లి, కట్టమైసమ్మ తల్లి దేవాలయాలను నిర్మించేందుకు స్థానిక నాయకులు ఆదివారం శంకుస్థాపనలు చేశారు. గ్రామస్తులు సహకారంతో నిర్మించేలా చర్యలు చేపడుతున్నట్లు నిర్మాణ నిర్వాహకులు వీరేశం గౌడ్ తదితరులు తెలిపారు.

ఘనంగా మైసమ్మ, ఎల్లమ్మ జాతర



జాతరలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): రాయిన్‌చెరు వద్ద ఉన్న కట్టమైసమ్మ జాతర ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమమవారి కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలని పూజలకు హాజరైన నాయకులు ఆకాంక్షించారు. అలాగే మండలంలోని మాదారంలో ఆదివారం రేణుకా ఎల్లమ్మ జాతర ఉత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మకు కల్యాణాన్ని జరిపారు. మాజీ సర్పంచ సురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి జాతర ఉత్సవాలకు హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

అందరూ సుభిక్షంగా ఉండాలి

ఎమ్మెల్యే సునీతారెడ్డి



అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర (సంగారెడ్డి): పోచమ్మ అమ్మ వారి దయతో అందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి వేడుకున్నారు. మండలంలోని కాసాల దౌల్తాబాద్ బస్టాండ్ సమీపంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, నాయకులు కిషోర్, రవి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి సన్మానం



శ్రీశైలంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్

ఝరాసంగం(జహీరాబాద్): ఏఎస్‌బీఆర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన కంబాలపల్లి గ్రామానికి శ్రీశైలాన్ని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ సన్మానించారు. ఆదివారం మండల కేంద్రంలో కార్యక్రమం జరిగింది. సన్మాన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు విజయ్‌కుమార్, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రకరణ్ వాగుపై అసంపూర్తిగా నిలిచిన బ్రిడ్జి పనులు

బ్రిడ్జి అందుబాటులోకి వచ్చేదెన్నడో?

మండల పరిధిలో గల ఓడీఎఫ్ నుంచి ఇంద్రకరణ్ వెళ్లే దారిలో ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ఇటీవల నిర్మాణం పూర్తి అయ్యింది. కానీ రెండు వైపులా మెటల్ పనులు చేపట్ట లేదు. దీంతో వంతెన అందుబాటులోకి రాకుండా పోయింది. కానీ వాహనాల రాకపోకల సాగించేందుకు తాత్కాలికంగా రోడ్డును ఏర్పాటు చేశారు. దాంతోనే ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జిని అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

-కంది(సంగారెడ్డి)



ఆరుట్ల రహదారిలో ఎరుపు, పసుపు పూలతో అందంగా కనిపిస్తున్న చెట్లు

మైమరిపించే ఆహ్లాదం

కంది(సంగారెడ్డి): హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు పచ్చదనంతో కళకళలాడుతూ చూపులను తిప్పుకోకుండా చేస్తున్నాయి. మండలంలోని చెర్లగూడెం, ఆరుట్ల, చిద్రుప్ప, బేగంపేట్, చేర్యాల, ఇంద్రకరణ్ గ్రామాల్లో ఐదేళ్ల క్రితం రోడ్లకు ఇరువైపులా గుల్ మోర్ మొక్కలు నాటాయి. ఇప్పుడు చెట్ల పెద్దవయి ఎరుపు, పసుపు రంగుల పూలు పూసి ఆకర్షిస్తున్నాయి. ఆకచెర్లగూడెం శివారుల నుంచి గ్రామం అవతలి వరకు.. ప్రయాణం కొత్త అనుభూతినిస్తుంది. వాహనదారుల, ప్రయాణికులు ఆహ్లాద వాతావరణానికి మైమరిచిపోతున్నాయి.

డిస్పెన్సరీ సేవలు మృగ్యం

- ఈఎస్ఐ ఆస్పత్రిలో నిలిచిన వైద్య సేవలు
- ఇబ్బందుల్లో రోగులు
- దీక్షకు దిగుతామంటున్న కార్మికులు

డిస్పెన్సరీ సేవలు అందుబాటులో లేకుండా పోయాయి. అద్దె బకాయిలు పెరగడంతో యజమాని కార్యాలయానికి తాళం వేశాడు. దీంతో హాస్పిటల్ పరిధిలోని రోగులు.. వైద్యసేవలు అందక అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రి తెరవకుంటే మాత్రం దీక్షకు దిగుతామని కార్మికులు హెచ్చరిస్తున్నారు. డిస్పెన్సరీ మూత పడిన విషయం తెలియక కొంతమంది దీర్ఘకాలిక రోగులు వచ్చి వెనుదిరుగుతున్న పరిస్థితి ఇక్కడ కనిపిస్తోంది.



పడిగాపులు కాస్తున్న రోగులు



డిస్పెన్సరీకి తాళం వేస్తున్న యాజమాని (ఫైల్)

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఈఎస్ఐ ఆస్పత్రి మూత పడి రెండు నెలలు అవుతుంది. అద్దె బకాయిలు చెల్లించడం లేదని ఇంటి యాజమాని డిస్పెన్సరీకి తాళం వేశారు. దీంతో వైద్య సేవలు నిలిచి పోయాయి. రోజూ పెద్ద సంఖ్యలో రోగులు ఆస్పత్రికి వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఆస్పత్రి సిబ్బంది కూడా డ్యూటీ ముగిసే వారకు అక్కడే ఉండి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఎవరూ పట్టించుకోనందునా కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకటి రెండు రోజులు ఎదురు చూసి నిరహార దీక్షకు దిగుతామని కార్మికులు హెచ్చరించారు. జహీరాబాద్ ప్రాంతంలో మహీంద్ర అండ్ మహీంద్రతో పాటు పలు పరిశ్రమలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. కర్మాగారాల్లో సుమారు 5 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారి కుటుంబాల కోసం పట్టణంలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. సొంత భవనం లేక దత్తగిరి కాలనీలో అద్దె ఇంటిలో డిస్పెన్సరీ నడుస్తుంది. ఆస్పత్రికి ప్రతి సుమారు 200 మంది రోగులు వస్తుంటారు. అయితే ఆస్పత్రి మూసేసి ఉండటంతో వెద్య సేవలు అందక రోగులు అవస్థలు పడుతున్నారు. బీపీ, షుగర్ దీర్ఘకాలిక రోగులు మందుల కోసం పడిగాపులు పడుతున్నారు.

జూన్ 2022 నుంచి బకాయి..

డిస్పెన్సరీ అద్దె నెలకు రూ.12,700లు. జూన్ 2022 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు రూ. 3 లక్షల వరకు కిరాయి చెల్లించ లేదని యజమాని తాళం వేశాడు. ఈ విషయం తెలియక రోజూ రోగులు ఇక్కడికి వచ్చి పోతున్నారు. ఆసుపత్రి సిబ్బంది కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండి వెళ్తున్నారు.

రెండేళ్ల అద్దె బకాయి

అద్దె విషయంలో ఈఎస్ఐ అధికారులు పట్టించుకోవడం లేదు. అగ్రిమెంట్ ప్రకారం ప్రతి మూడు నెలలకోసారి అద్దె చెల్లించాలి. కానీ రెండు సంవత్సరాల నుంచి కిరాయి ఇవ్వడం లేదు. సుమారు రూ. 3 లక్షల వరకు రావాల్సి ఉంది. ఓపిక నశించి తప్పని పరిస్థితిలో తాళం వేశాను.

-భరత్, ఇంటి యాజమాని

బిల్లులు పాస్ కాలేదు

ఈఎస్ఐకి సంబంధించిన బిల్లులు పాస్ కాలేదు. అందుకని అద్దె చెల్లింపు విషయంలో జాప్యం జరుగుతుంది. డిస్పెన్సరీకి తాళం వేసి విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. యాజమానితో మాట్లాడి త్వరలో ఆస్పత్రి ఓపెన్ చేస్తాం. అప్పటి వరకు రోగులను ఇతర ఆసుపత్రులకు పంపుతున్నాం.

-దశరథ్, ఈఎస్ఐ ఆసుపత్రి అధికారి

మెదక్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగరేస్తాం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



రామచంద్రాపురం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మెదక్‌లో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి తెల్లాపూర్‌లో మున్సిపాలిటీ ముఖ్యనేతలతో కలిసి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 30న బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించే ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలోని ప్రజాప్రతినిధులు, ప్రతి వార్డు నుంచి ముఖ్య నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, కౌన్సిలర్లు లచ్చిరాం నాయక్, బాలాజీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు

పటాన్‌చెరు: సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. ఆదివారం సాయంత్రం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ బాలాజీ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన అమీన్‌పూర్ మున్సిపల్, మండల మెదక్ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరయ్యారు. కరువు కాటకాలతో తల్లడిల్లిన రాష్ట్రంలో గోదావరి జలాలు తీసుకొచ్చి నీటి గోస తీర్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. నిత్యం నీటి ఇబ్బందులు ఎదుర్కొనే అమీన్‌పూర్‌కు మిషన్ భగీరథ ద్వారా మంచి నీటిని అందించారన్నారు.

సొంత గూటికి గిరిజన నాయకులు



ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో చేరిన గిరిజన నాయకులు

జహీరాబాద్ టౌన్: బీజేపీలో చేరిన గిరిజన నాయకులు తిరిగి బీఆర్‌ఎస్ సొంత గూటికి చేరారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్ సమక్షంలో మొగుడంపల్లి మండలం గొసాబాద్ తండాకు చెందిన తాజా మాజీ సర్పంచ్ సంజీవ్ రాథోడ్, డిప్యూటీ సర్పంచ్ జాను రాథోడ్ మరికొంతమంది ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. రిజర్వేషన్లు ఎత్తివేస్తామని బీజేపీ నాయకులు పేర్కొనడంతో సొంత గూటికి వచ్చామని గిరిజన నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి దేవిప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు సంజీవ్‌రెడ్డి, గోపాల్, సంజీవ్ పవార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దంపతులకు రాములోరి తలంబ్రాలు



ఎమ్మెల్యే దంపతులకు రాములోరి తలంబ్రాలు అందజేస్తున్న ఆర్టీసీ పీఆర్వో పాండు

నారాయణఖేడ్: భద్రాద్రి రాములోరి తలంబ్రాలను ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, ఆయన సతీమణి అనుపమారెడ్డి దంపతులకు ఆదివారం ఆర్టీసీ పీఆర్వో పాండు అందజేశారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని భక్తులకు ఇంటి వద్దకే తలంబ్రాలు అందించే కార్యక్రమాన్ని ఆర్టీసీ ప్రారంభించడం తెలిసిందే. అందులో భాగంగా తలంబ్రాలను ఎమ్మెల్యే బుక్ చేసుకోవడంతో అందించారు. భద్రాద్రి రాములోరి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

- నిజాంపేట మండలం మునిగేపల్లిలో ఆదివారం నిర్వహించిన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ శిఖర పునఃప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి.

కాంగ్రెస్ పాలనలోనే సంక్షేమం



సదాశివపేట: పృథ్వీరాజ్ కు కండువా వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న నిర్మల

ఫిల్మ్ సంస్థ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ సంస్థ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మందగుబ్బడి తండాలో మొగుడంపల్లి మండలంలోని పలు తండాలకు చెందిన బీఎస్‌ఆర్ నాయకులు ఆదివారం పార్టీలో చేరారు. వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తోందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లను నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి, గుండారెడ్డి, గోపాల్, కిషన్ పవార్, గోల్లభాస్కర్, హర్షవర్ధన్‌రెడ్డి, నాగిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాములు, అనంత నవీన్, అశ్విన్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి పృథ్వీరాజ్

సదాశివపేట(సంగారెడ్డి): మెదక్ లోక్‌సభ స్వతంత్ర అభ్యర్థి, తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సదాశివపేట పట్టణానికి చెందిన తుమ్మలపల్లి పృథ్వీరాజ్ కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం అన్నారంలో టీఎస్ఐఐటీ చైర్మన్ నిర్మల, మెదక్ ఎంపీ అభ్యర్థి నీలంమధు సమక్షంలో చేరారు.

తండాలను పంచాయతీలుగా చేశాం

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): బీఆర్‌ఎస్ హయాంలో తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేశామని మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఖానాపూర్(కె), పొమ్యా నాయక్ తండాలో పార్టీ జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తరఫున ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు అంజయ్య సాగర్, గోపాల్‌రెడ్డి, గణపతి, మోహన్‌సాగర్, సాయిలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కొనసాగుతున్న నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న నగర సంకీర్తన కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుంది. భక్తులు భజనలు కీర్తనలు ఆలపిస్తూ పాదయాత్ర నిర్వహించారు. రెండేళ్ల క్రితం ప్రారంభమైన కార్యక్రమం 100 వారాలు జయప్రదంగా పూర్తి చేసుకుంది. వంద వారాలైన సందర్భంగా నిర్వాహకులు ఆదివారం పట్టణంలోని దత్తగిరి కాలనీ పంచముఖి హనుమాన్ మందిరం వద్ద భారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ నగర సంకీర్తనకు మంచి స్పందన వస్తుందన్నారు.

◆ యువకుల రక్తదానం



రాయికోడ్(అందోల్): యువకులు ఉత్సాహంగా రక్తదానం చేశారు. మండల కేంద్రం రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర యువజన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జాతర వేడుకల సందర్భంగా ఆలయానికి చెందిన ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. సంగారెడ్డిలోని జిల్లా ప్రభుత్వాసుపత్రికి చెందిన వైద్యులు, సిబ్బంది విచ్చేసి బ్లడ్‌ను సేకరించారు. 40 మంది రక్తదానం చేసినట్లు సంఘం నాయకులు తెలిపారు.

◆ కాంగ్రెస్‌లోకి చేరికలు



రాయికోడ్(అందోల్): కాంగ్రెస్ పార్టీలోకి ఆదివారం నాగ్వార్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు చేరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి.అంజయ్య ఆధ్వర్యంలో సాదిక్ పటేల్, జబ్బార్, హమీద్‌మియా కుటుంబాల వారికి కండువా వేసి ఆహ్వానించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయం సాధిస్తుందని జి.అంజయ్య ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బి.నర్సింహులు, యూత్ ప్రెసిడెంట్ ప్రభాకర్, పార్టీ సీనియర్ నాయకుడు జ్ఞానేశ్వర్, విఠల్, కేదార్‌నాథ్ పాటిల్, సతీష్‌కుమార్, పండరి తదితరులు ఉన్నారు.

◆ బీజేపీ ఇంటింటి ప్రచారం

జహీరాబాద్ టౌన్: బీజేపీ లోక్‌సభ అభ్యర్థి బీబీ పాటిల్‌కు మద్దతుగా పార్టీ శ్రేణులు పట్టణం, గ్రామాల్లో ప్రచారం చేశారు. శాంతినగర్ తదితర కాలనీల్లో పర్యటించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. మొగుడంపల్లి మండలం ధనసరిలో మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పట్టణ అధ్యక్షుడు విశ్వనాథ్, నాయకులు సంతోష్, అర్చన సరడా, అప్పం శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

నారాయణఖేడ్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ డివిజన్ నాయకులు చిరంజీవి, ఆనంద్, ప్రేమ్, సంజీవ్ కుమార్, అశోక్‌లు కోరారు. ఆదివారం స్థానికంగా విలేకర్లతో మాట్లాడారు. అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు, బీఎల్వో విధులు అప్పగించడం పట్ల పని భారం అధికమవుతుందన్నారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలు నిరంతరం చిన్నారులు, గర్భిణులకు సేవలు అందిస్తుంటారన్నారు. అందువల్ల వారికి పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయడమే కాకుండా బీఎల్వోలుగా విధులుగా నిర్వహించిన కాలానికి పారితోషికం వెంటనే చెల్లించాలన్నారు. అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు ఒకే సారి నెల రోజుల పాటు సెలవులు ఇవ్వాలన్నారు.

◆ బీఆర్‌ఎస్ ప్రచారం



జోగిపేట(అందోల్): స్థానిక సంతలో బీఆర్‌ఎస్ జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా పార్టీ నేతలు ఆదివారం ప్రచారం నిర్వహించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ డీబీ నాగభూషణం, మాజీ ఎంపీపీ అధ్యక్షుడు హెచ్.రామాగౌడ్‌ల ఆధ్వర్యంలో దుకాణాల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు అందజేసి అనిల్‌ను గెలిపించాలని కోరారు. తమ అభ్యర్థిని గెలిపిస్తేనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని నాగభూషణం, రామాగౌడ్‌లు అన్నారు. ప్రచారంలో పార్టీ నాయకులు బీర్ల శంకర్ యాదవ్, మహేష్ యాదవ్, సంతోష్ కుమార్, గోరే, మల్లేశంలతో పాటు పలువురు పాల్గొన్నారు.

◆ ఘనంగా మల్లన్న కల్యాణోత్సవం

మునిపల్లి(అందోల్): భ్రమరాంభ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం పొల్కంపల్లిలో గొల్ల కురుమలు ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భక్తులు మల్లనకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

◆ హామీలను నెరవేర్చాలి

మునిపల్లి(అందోల్): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బొడిషేట్‌పల్లిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో తెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్, శివశంకర్, అంజయ్య, భాస్కర్, దత్తు, సురేష్ పాల్గొన్నారు.

◆ వైభవంగా బోనాలు

పుల్‌కల్(అందోల్): మండల కేంద్రం పుల్‌కల్‌లో బీరప్ప జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎనిమిది రోజుల పాటు నిర్వహించే ఈ కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం మహిళలు బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివసత్తుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

◆ పెండింగ్ వేతనాలు చెల్లించాలి



సంగారెడ్డి టౌన్ : ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి అన్నారు. ఆదివారం సంగారెడ్డిలోని సుందరయ్య భవన్ లో హాస్పిటల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారని ప్రభుత్వం స్పందించి వెంటనే విడుదల చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ యూనియన్ నాయకులు యాదగిరి, శుభ రమాదేవి, రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.